

మారుతి

ఊరు మాటు మణిగింది. చూరులోనించి బాణా కర్ర అందుకుని బయటకు నడిచాడు పాపారావు. కుక్కపిల్లలు కాళ్ళకు చుట్టుకుని 'కుయ్యోకుయ్యో' మన్నయి. కాళ్ళతో వాటిని విదిలించాడు. ఒకటి రెండు పిల్లలు ఎగిరి అంతదూరానపడి లేచి ఒళ్ళు దులుపుకుని మళ్ళీ అతనివేపే వచ్చినయి.

కాని పాపారావు నడక వేగాన్ని అందుకోలేక కొంత దూరం వచ్చి ఆగిపోయినయి. బనీను జేబులోనుంచి బీడీతీసి నోట్లో పెట్టుకుని అగ్గిపుల్ల వెలిగించాడు. గాలికి ఆరిపోయింది. యింకో పుల్లగీసి బీడీ వెలిగించుకున్నాడు. అడుగులు జోరుగా పడుతున్నయి.

ఒక గుడిశముందు ఆగాడు పాపారావు. అగి దగ్గాడు. ఆ సవ్వడికి జవాబుగా గుడిశలోనుంచి రెండు ముంతలు పట్టుకుని ఈరన్నబయటికి వచ్చాడు.

ఆ ముంతలు చూస్తూనే అన్నాడు పాపారావు. "వద్దు ఈరన్నా! యియ్యాల పేణం బాగులేదు" అని.

"ఏం కత!" అడిగాడు ఈరన్న.

"కత ఏంలేదుగాని, గురువులుగాని యిటు వచ్చాడా!" అని అడిగాడు పాపారావు.

రాలేదన్నాడు ఈరన్న. ముంతలు లోపలికి తీసుకెళ్ళబోతుంటే పాపారావు కోరికను అదుపులో పెట్టుకోలేకపోయాడు.

"సరేలే!" అన్నాడు.

ఈరన్న నవ్వుకుంటూ వెనక్కి తిరిగి రెండు ముంతలూ పాపారావుకు అందించాడు. ముంతలు రెండూ గుటకల్లో ఖాళీ చేశాడు. రూపాయి కాయి తాలు ఈరన్న చేతులో పెట్టాడు.

"యియ్యాల అయిసా వయిసా తేల్చుకోవాలి" అనుకున్నాడు పాపారావు.

"ఎవురిదో!" ఈరన్న కుతూహలంగా అడిగాడు.

"యిదుగో ఈరన్నా! నీ నోట్లో నువ్వుగింజ నానదు. అన్ని సంగతులూ నీకే కావాలి. కాటికి కాళ్ళు చాచుకున్న నీకు యింత యావ యెందుకు చెప్పు! నీ యాపారం నువ్వుచూసుకో!" అని పాపారావు అక్కడినుంచి కదిలాడు.

"అది బుర్ర రామకీర్తన పాడిస్తా! ఒక్కయేటుకు రెండు చెక్కలు అవ్వాలి! గిలగిలా తన్నుకుంటూ పేణాలు వదలాల! సచ్చిపోయేటప్పుడు, ఆ చావు దెబ్బ. కొట్టిందెవరో తెలుసుకుని మరీ సచ్చిపోవాల! అప్పుడుగాని గోదారి పొంగులాంటి తన పగ సల్లారదు. నీతి, జాతిలేని మనిసి! డబ్బుండగానే సరిపోద్దా! సానిది సంపాయిత్తంది డబ్బు. దొంగసారా అమ్ముకుని ఈరన్నా సంపాయిత్తన్నాడు వందల కొందలు......మనిసై పుట్టినాక నీతి ఉండాల! అది లేకపోయినాక కుక్కతో సమానం! అటువంటి మనుసుల్ని భూమ్మీద ఉండనీయకూడదు..... కూడదు....సుబ్బులు సంగతి తనకు తెలుసు. దాని వంటిమీద చెయ్యేయబోయినోడి చెయ్యి ఒక్క దెబ్బకు యిరిగి కిందపడాల. సుబ్బుల్నిచూసి నవ్వినవాడినోటంట రకతం కక్కించాల. సుబ్బుల్ని చూసి కన్నుగొట్టిన వాడి కళ్ళు దెబ్బకు చిట్లిపోవాల! అప్పుడుగాని, నీతిగల ఆడదాని జోలికి పోయినోడి గతి ఏమవుతుందో తెలిసిరాదు. ఆడి సావుతో లోకం కూడా తెలుసుకోవాల. ఆడికి పెళ్లాంలేదా! అప్పచెల్లెళ్లులేరా! ఆళ్ళ ఒంటిమీద సరాయి లగాడెవరయినా చెయ్యేస్తే ఆడికి ఎట్లాఅని పిస్తది! ఏమీ అనిపించదేమో! నీతిలేనినాయాలికి ఏమీ అనిపియ్యకపోవచ్చు. ధూ! అట్లాంటిబతుకు బతికేకంటే సచ్చేది మేలు! డబ్బుతో ఎంత అవినీతి అయినా కప్పి పెట్టుకోవచ్చు. పెద్దాళ్ల లోగిళ్ళల్లో ఎన్ని అన్నేయాలు జరుగుతుంటాయో ఎవరి కెరిక! ఆళ్ళా, ఆళ్ళా ఎట్టా సచ్చినా, మాలాంటి బీదోళ్ళజోలి కెందుకు రావాల! కూలి నాలి చేసుకుని పొట్టనింపుకునే మా అమంటోళ్ళంటే యీళ్ళ కెందుకు యింత లోకువ ఆళ్ళకు డబ్బుంటే ఆళ్ళకే ఉంటదిగాని మాకేమన్నా పెడతారా! మనిసికి నీతి కావాల! అతర్వాతనే ఏదన్నా!"

జిల్లేడు డొంకలో నడుస్తున్న పాపారావు ఆగిపోయాడు. ఎదరగా ఎవరో వస్తున్నారు.

"నువ్వేనంటరా గురువులూ! యీయాల్టివుడు ఎక్కడికెళ్ళివత్తన్నా" నవడిగాడు పాపారావు.

ఒళ్ళు తెలీకుండా తాగి ఉన్నాడు గురువులు. వాడు చెప్పిన సమాధానం పాపారావుకు అర్థంకాలేదు. వాడి రెండు బుజాలు పట్టుకుని ఊపి "ఉరే

గురువులూ, నీ చెల్లెలిమీద చెయ్యి యెయ్య బోయాడంటరా నాయుడు. ఆడి అంతుసూడాల! నువ్వూ రారా నాతో'' అన్నాడు పాపారావు.

గురువులు మంచి నిషాలో ఉన్నాడు. "నాగేస్రావు ఏవన్నాడో తెలుసా... జగమే మాయా, బతుకే మాయా .....యింతేనయా.....బతు కింతేనయా.......సఫా!......దెబ్బకి ఠా.....గిలగిలా గిలగిలా తన్నుకుని.. ..."

అర్థం పర్థం లేకుండా వాగుతున్న గురువుల్ని తప్పించుకుని ముందుకు నడిచాడు పాపారావు.

'గురువులికి చెల్లెలంటే పేణం. దానికోసం తను సచ్చిపొమ్మన్నా పోతాడు. సుబ్బుల్ని తన కిచ్చి జెప్పిన రోజున అందరి ముందరా అట్టాగంటే గొప్పకోసం అన్నాడేమో ననుకున్నా డతను. 'ఒరే పాపిగా, నా చెల్లెల్ని పువ్వుల్లో పెట్టి పూజ సేసుకోరా! దాని మనసు నొప్పించకుండా ఏలుకో! దానిమీదేరా నా పంచపేణాలు. అదేరా నాకు అమ్మయినా, నాయనయినా'' అన్నాడు కళ్ళ నీళ్ళెట్టుకుంటా. ఆడికి గనక యీ సంగతి తెలిస్తే..... ఆ నాయుడి పీక నులిమేస్తాడు. గొయ్యి తీసి నిలువునా పాతేస్తాడు....కాని.....యిప్పుడు వాడు వినిపించుకునేస్థితిలో లేడు. అన్నీ మంచి గుణాలేగాని, తాగుడే వదల్లేకుండా ఉన్నాడు. తాగినా మోతాదుగా తాగడు. ముంతలు ముంతలు నీళ్ళలాగ తాగేస్తాడు. వళ్ళు స్వాధీనం తప్పేదాకా తాగుతాడు. వద్దంటే యినడు. 'దానివల్ల నేనెవ్వరికీ అపకారం చెయ్యటంలేదుగా!' అంటాడు.

పాపారావు ఆరిపోయిన బీడీముక్కను విసిరేసి యింకోటి వెలిగించాడు. డొంకదాటి పుట్టిరోడ్డు ఎక్కాడు. బురద బురదగా ఉన్నది దోవంతా. మూడురోజులనాడు కురిసినవానకు తడిసిన రోడ్డు యింకా ఆరలేదు. పక్కన తుమ్మచెట్లకిందనున్న పిచ్చిమొక్కలమీద మిణుగురు పురుగులు ఎగురుతున్నాయి. కీచురాళ్ళు గీపెడుతున్నాయి. అతని అడుగుల చప్పుడుకు బురద పాములు బెదిరి గింగిరాలు తిరిగి పంటకాలవలోకి జారిపోతున్నాయి. ఆకాశంలో చుక్కలు, వాటికడ్డంగా పరుచుకున్న పాలపుంత. చేలమీదనించి రివ్వున వస్తున్న చలిగాలి.. యివేమీ బాధించడం లేదతన్ని. లోపల అగ్గిరాచి నట్టు మంట! క్రోధం, రోషం, పగ కుత కుత ఉడికిపోతున్నది. నాయుడి శిరస్సు వక్కలు కావాల, యీ వేడి సల్లారాల!

సుబ్బులు కళ్ళ నీళ్ళు పెట్టుకోటం సూత్తంటే తన గుండె తరుక్కుపోయింది. మనువు ఆడిం తర్వాత దాని కళ్ళమ్మట తడి చూడటం యియ్యాలే! దానికి ధైర్యం చెప్పి, తెల్లారితే నరకాసురుడు సత్తాడే! అదే యాళకి నీమీద చెయ్యేసినోడి తల రెండు చేస్తానని మనసులో అనుకున్నాడు. పండక్కి తల్లిగారింటికి పంపేశాడు సుబ్బుల్ని.

'ఆడు మంచోడుగాడు. ఆడి జోలికిపోమాకు' అన్నది 'సుబ్బులు. సరేలేయే' అన్నాడు. నమ్మకం కాలనట్టు చేతులో చెయ్యి వేయించుకుని మరీ యిల్లు కదిలింది సుబ్బులు. 'దీపావళమాసవాడు నీకోసం ఎదురుసూత్తుంటా' అన్నది అతని గుండెల మీద తల ఆన్చి. సుబ్బులు తలమీద గోముగా పెదాలతో తాకాడు.

"మీ యమ్మతోచెప్పే అల్లుడొస్తున్నాడు. కోడిపలావు చెయ్యమని'' అన్నాడు.

సుబ్బులు నవ్వింది. ఆ నవ్వే నాయుడిలాంటి వాళ్ళని రెచ్చగొట్టుద్ది! స్వచ్ఛమయిన వెన్నెలలాంటి నవ్వు అది. తలమీద ముద్దుపెట్టుకుని ఆమెను సాగ నంపాడు. నాసొత్తుమీద చెయ్యి వెయ్యగల మగాడా ఆ యదవ! ఉఫ్ఫని వూదితే ఎగిరిపోయే యెదవన్నర యెదవ! నీగాలేని యదవ!! పాముకి ఒక్క తలలోనేనంట యిషముండేది. డబ్బుతో మదించిపోయినోళ్ళకి వళ్ళంతా ఉంటది యిషం. ఆ యిషం ఏంటో ఒక్కదెబ్బకు ధిగిపోవాల! పాపిగాడి తడాఖా తెలుసుకోవాల! మళ్ళీ జల్మలో ఏ ఆడగూతురిజోలికీ పోకుండా ఉండాల! గురువుల్ని గూడ సాయం ఉండరా అంటే నాయాల్ది, నిషామీద ఉండి.....తన మాట యినిపించుకుంటేనా!.....పిడాపెంకి యదవ. కట్టపడి సంపాయిత్తాడు. దమ్మిడీ మిగల్చకుండా చిత్తుగా తాగేత్తాడు.... ఎవుడి పిచ్చి ఆడికి ఆనందమంటని బాపనాయన చెప్పింది నిజమే! అత్యలుచేత్తే పాపం సుట్టుకుంటదంటగాని, మరి పగ ఎట్టా తీరాల! అన్యేయంగా ఒక పరాయి ఆడగూతురిమీద అగాయిత్తంపేత్తే ఆ పాపం వూరికే ఎట్టాపోవాల! బాణాకర్రదెబ్బకు తల పగలాల, నెత్తురు చిమ్మాల, భూమ్మీదబొట్లు పడాల.....అప్పుడు పగ సల్లారాల!

సీతమ్మోరిని పెరబట్టిన రావణాసురుణ్ణి సంపిన రాములోరికి పాపం అంటుకుందా! మరి అటువంటి పనే తనూ సేత్తే తప్పేంటి! దురమారగంగా నడిచేటోళ్లని దురమారగింగానే బుద్ధి సెప్పాల! పాపం అంటదు.....సుబ్బులిని బలవంతంగా చెరబట్టబోయిన నాయుడికి రావణాసురుడిగతే పట్టాల!

బురదలో కూరుకుపోయిన కాలికి తుమ్మముళ్ళు గావాల గుచ్చుకున్నయి. తిట్టుకుంటా ముందుకి వంగి కాలులో దిగబడిన ముల్లు వూడపెరికి కసిగా విసిరేసి ముందుకు సాగాడు.

ఎదరగా కొంతమంది లాంతర్లు పట్టుకునిపాపారావు కెదురుగా వస్తున్నారు. వాళ్ళు గొడవగా మాట్లాడుకుంటున్నారు. పాపరావు తొందరగాఅడుగు లేశాడు.

నాయుడిగారి పాలేళ్ళు, యింకా వూరి పెద కాపు, చిన మునసబు, యింకా ఎవురెవురో చాలా మంది ఉన్నారా గుంపులో. పాపారాయుడి గుండెలు గుబగుబలాడినయి. పంటకాలవ కడ్డంపడి పక్కనున్న వరి చేనులో దాక్కున్నాడు. తను చేసిన పనికి నవ్వుకున్నాడు. ఏ నేరమూ చెయ్యని తను ఎందు కిట్లా దొంగలా దాక్కున్నాడు!

లాంతర్ల వెలుతురు దాటిపోయిందాకా అక్కడే నక్కి, మెల్లగా లేచి బురద రోడ్డువెంట నడిచి వూళ్ళోకి చేరుకున్నాడు.

వూరి మొదట్లో వేపచెట్టుకింద చేరిన జనం చెప్పుకునే మాటలకి పాపారావు దిమ్మరపోయాడు.

నాయుణ్ణి లాకులకి దిగువన పంటచేనుదగ్గర ఎవళ్లో తల పగలగొట్టి చంపారు! ఎవరు కొట్టారో చూసిన వాళ్లెవరూ లేరంట!వూరంతా గుప్పుమన్నది.

పాపారావు వడివడిగా అత్తగారింటికిపోయి చూరుకిందుగావంగి యింట్లో దూరాడు. సుబ్బులతన్నిచూసి ఆశ్చర్యపోయింది.

దగ్గరగావచ్చి అతని చేతులు తన చేతుల్లోకి తీసుకుని పరీక్షగా చూసింది. అతని చొక్కామీద రక్తం మరకలుచూసి కెవ్వున అరిచింది సుబ్బులు.

"అనుకున్నంత పనీ చేశావా!'' అన్నది ఏడుస్తూ.

"ఏంటే నువ్వనేది!'' అన్నాడేగాని పాపారావుకు తన బట్టలమీద రక్తం మరకలు ఎట్లా అయినయో ఆలోచించలేకపోయాడు.

పొలంలో దాక్కుంటే ఏదయినా గుచ్చుకుందా.....కాలిలో ముల్లు లాగినప్పుడు అయిందా... ముంతలో కల్లు తాగినప్పుడయిందా.....దారిలో గురువుల్ని పట్టుకున్నప్పుడు....వాడన్నమాటలు!! ......జగమేమాయా, బతుకేమాయా..... యింతేనయా!.....సఫా.......దెబ్బకి ఠా......

చెల్లెలికి జరిగిన అవమానానికి ప్రతీకారంవాడు తీర్చుకున్నాడు! తనకా అవకాశం దక్కకుండా జేశాడు!

"సుబ్బులూ! నేను మాత్రం ఆపని చెయ్యలేదు నన్ను నమ్ము......నీ కిచ్చిన మాట నిలుపుకున్నానే'' అన్నాడు పాపారావు జగమేమాయా.....బతుకే మాయా అని జ్ఞాపకం చేసుకుంటూ. ●

